ఆడాళ్ళని మభ్యపెట్టటానికి ప్రేమంటూ ఒకటి లేవదీశారు. ఏమిటా ప్రేమ? తెలీ కడుగుతాను. మొదట్లో కాస్త బులపాటం ఉంటుంది. అదికాస్తా వారం తిరక్కముందే తీరిపోతుంది. ఆ తరవాత అది చట్టపు మాపుగా వొస్తూపోతూఉంటుంది. ఆ తరవాత సినిమా ప్రేమే-అంటే త్యాగంచేస్తూ పోవటం, బలికావటం, అష్టకష్టాలూ సహించి, ఆలోలక్షణా అని ఏడవటం. అదే ప్రేమంటే!

కాదన్న - మగాళ్ళ కొందరు పెళ్ళాలకి ఫాషన్లుచేస్తారు. చీరెలు కొంటారు. చాతనయితే కారెక్కించి తిప్పుతారు. దేనికి? వాళ్ళ హోదా నిలబెట్టుకోటానికి! గొప్పగొప్పవాళ్ళళ్ళకట్టిస్తారు చూడరాదూ? అదే పద్ధతి! వీసమెత్తు తేడాలేదు.

ఒక్కవిషయంలో మనం నిజంగా పైకొస్తున్నాం. అది నేను కాదన్ను. పత్రికలపైన ఆడాళ్ళ బొమ్మలుచూడండి. సినిమా పోస్టర్లమీద చూడండి. పత్రికల ప్రకటనల్లో చూడండి. ఆడది విధిగా ఉండితీరాలి ఈమాట మగాళ్ళ విధిలేక ఒప్పుకుంటున్నారు.

కథలుకూడానూ, ఆడాళ్ళరాసిన కథలే బాగుంటున్నాయి. మగాళ్ళకూడా చచ్చినట్టు అవే చదూతున్నారు. కథలపోటీ, నవల్లపోటీ - అన్నింట్లోనూ ఆడాళ్ళే నెగ్గుకొస్తున్నారు. ఇదిచూసి కొందరు మగాళ్ళ - మొహాలకు సిగ్గన్నలేదు! - పెళ్ళాలపేరా, కూతుళ్ళపేరా పత్రికలకి కథలు పంపిస్తున్నారు! మగాళ్ళగతి అక్కడికి దిగజారింది!

తెలీకడుగుతాను మంచి నవల రాయటానికి ఆడది లిప్‌స్టిక్కేసుకుని, ఎత్తుమడమల చెప్పులు తొడుక్కోవాలా? సినిమాతార కావటానికి బియ్యేలు పాసుకావాలా? ఇంకా ఈ మగాళ్ళ మన్నేదో ఉద్ధరించి పైకి తెస్తామనీ, చదువుకోమనీ, ప్రేమించి పెళ్లాడమనీ, ఏవేవిటో అంటారేమిటి?

వాళ్ళమాటలు నమ్మకండి. వాళ్ళ చెప్పినవేవీ చెయ్యకుండానే మనం పైకిరాగలం-వస్తున్నాంకూడా! 000

— "సత్యభామ"


# అమరసాహితి - ఉత్తమసాహిత్యం

అగ్నిశిఖలు...మంచుజడులు (కవిత) - కమ్మిశెట్టి

వీడినపాయలు(నవల) - సింగరాజు లింగమూర్తి

'రాత్రి' - కవితా సంకలనమ్

సంపెంగపొదలు(నవల)

— శ్రీమతి సి. ఆనందారామం

(ఆంధ్రసచిత్ర వారపత్రికలో ధారావాహినిగా వెలువడిన నవల)

వివరాలకు మాతో సంప్రతించండి :

అమరసాహితి,
గోషామహల్-హైదరాబాదు.

సంపాదకులు :
అడపా శివాజినాయుడు.




# అన్యాయం

## కొడవటిగంటి కృష్ణమూర్తి

*ఆదివారం అందరికీ సెలవేకదా అనుకుంటే రామనాథాయికి ఆరోజునా 'పని' వుందని తెలిసేటప్పటికి నాకాశ్చర్యం వేసింది. వాడి ఖర్మకాకపోతే మరేమిటి?*

ఏ. యు. సి. చదువుతుండగా పరీక్షలు మూడునెలలున్నప్పటికీ నేనెంత బతిమాలినా వాడొక్క సినిమాక్కూడా వచ్చేవాడుకాదు. నాదెప్పుడూ వానాకాలం చదువే కాబట్టి, నిండామునిగినవాడికి చలేమిటి అన్న ధోరణిలో నేమటుకు సాధ్యమైనంత వరకు ఏ సినిమా వదిలిపెట్టేవాడినికాదు. కాని చివరకు వాడు పరీక్ష తప్పటం, నేను ప్యాసుకావటం జరిగింది. ఇలాటి అన్యాయాలు అనేకమంది జీవితాల్లో జరగటం మామూలుగా చూస్తూనే వుంటాం. కాని నా ఆత్మకు ఒక్కటే సంతృప్తి - వాడు పరీక్ష తప్పటానికి నేనుమటుకు కారణంకాదు. లేక నేనేనా? ఎలాగైనా వాణ్ణి సినిమాలకి లాక్కెళ్ళివుంటే వాడి మనస్సు కొంత తేరుకుని, చదివినది తలకెక్కి, వాడూ నాకు మల్లే ప్యాసయివుండేవాడా అన్న ఆలోచన నన్నినాటికీ బాధిస్తూనే వుంటుంది!

రామనాథాయి తర్వాత సెప్టెంబరు పరీక్షల్లో ప్యాసయి ఇంట్లోవుండే రోజుల్లో వాళ్ళ నాన్నకు అపూర్వమైన ఆలోచన తట్టి మునిసిపాలిటీలో ఉద్యోగమేదైనా వుంటేమోనని విచారించాడు. మునిసిపాలిటీ ఉద్యోగాల్లో ఎప్పుడూ ఖాళీవుండదనీ, ఉద్యోగాలు సంపాదించేవాళ్ళు సంపాదిస్తూనే వుంటారనీ తేలింది. మొత్తంమీద రామనాథాయికి మునిసిపాలిటీలో ఖాళీలేని గుమాస్తా ఉద్యోగమే దొరికింది. అదే ఇంతకు తెచ్చింది కాబోలు!

నేను బి.ఏ కూడా చదివి, లాయరు పరీక్షకూడా ప్యాసయి ఇంటిముందు బోర్డు తగిలించే సమయానికి రామనాథాయి ఉద్యోగంలో రాయి అయిపోయినాడు. "ఊళ్ళో ఉద్యోగం!" అని వాడి తండ్రి ఆయన ఆత్మకు, ఇతరుల మనస్సులకు తృప్తికలిగించాడు. "గుమాస్తాగా ప్రారంభమయి గవర్నరుదాకా వెళ్ళినవాళ్ళున్నారు" అని రామనాథాయి నాతో వాదిస్తూవచ్చాడు. వాడి ధైర్యం, ఆత్మ విశ్వాసం నాకు కొంత ఆనందం కలిగించక పోలా.

రామనాథాయి తన పనిని అతిశ్రద్ధగా, ఏ పొరబాటు రానీకుండా, ఎవ్వరూ తప్పు పట్టటానికి వీల్లేకుండా చేసేరకం. వాడికి ఈ "అతి" చిన్నప్పటినుంచే ఎలాగో అలవాటయింది. మునిసిపాలిటీలో ఎవర్ని అడిగినా అలాటి గుమాస్తా లేడంటారు. అలాటి వాడిని పైకి పోనిచ్చి ఏ తెలివితక్కువ గుమాస్తానో తెచ్చుకుని అవస్థలు పడటానికి ఎవ్వరికీ ఈ అయిదారేళ్ళబట్టీ ఇష్టంలేకుండా పోయింది. అఖిల భారత ఉత్తమ గుమాస్తా పోటీలో రామనాథాయి తప్పక మొదటి వాడుగా వస్తాడని అంతా అంగీకరిస్తారు. కాని ఒకవేళ అలాటి పోటీపెట్టితే వాడిని బహుశా పాల్గొననీయరు. ఏమో అప్పుడే మవుతుందో! ఇంతెందుకు – వాడెంత మంచి గుమాస్తాట అంటే వాడు ఆఫీసునుంచి ఇంటికిపోవటానికే ఎవ్వరికీ ఇష్టం లేదు!

అదిమటుకు రామనాథాయి తవ్వుకున్న గొయ్యేనట. అందరిగుమాస్తాలకూ వారం, పది, నెల రోజులుపట్టే పనిని రామనాథాయి ఓ గంటలో చేస్తాట్ట. కాని, వాడొక గంటలో చేసే పనికి కడం గుమాస్తాలు వారం, పదిరోజులు తీసుకుంటారట. అంటే రామనాథాయి మేధావి అనీ కాదు, మిగతా గుమాస్తాలు దద్దమ్మలూ అనీకాదు. వాళ్లూ ఆ పనిని ఒక గంటలోనే చెయ్యగలరట కాని పదిరోజులన్నా తీసుకోకపోతే పని వున్నట్టు వుండదట! రామనాథాయి తనకిచ్చిన ప్రతి పనిని త్వరగా, చక్కగాచేసి చూపటంవల్ల కడంవారికి చెడ్డపేరు రావటం దాకా రావటం, రామనాథాయికి పనివున్నా లేకపోయినా మిగతావాళ్ళు, ఆఫీసు అధికార్లు అతనిని ఎక్కువగా ఊదరపెట్టటం, రామనాథాయి ఉద్యోగ జీవితం గిడసబారిపోవటం కొద్దికాలంలోనే తేలిపోయిందిట!

సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో రామనాథాయిని కలుసుకోటానికే వీల్లేకుండా పోయింది. కోర్టులో పనిలేకపోవటంవల్ల నేనెప్పుడన్నా సాయంత్రం వాడి ఆఫీసుకు వెళ్ళుతూ వుండేవాణ్ణి. నేనక్కడ వున్న నాలుగు నిమిషాల్లో ఎవరో వాణ్ణి పిలిచేవాళ్ళు. వాడో గదిలోకివెళ్ళి వచ్చి నాతో ఏదో చెప్పబోతుండగా మళ్ళీ యింకెవరో కబురుచెయ్యటం, వాడు మరో గదిలోకి పోవడం జరిగేది. కాని ఒకసారి వాడు నాతో ఇంటికి బైలుదేరబోతుండగా ఎవరో వచ్చి ఏదో చెప్పి ఆఫీసునుంచి వెళ్ళిపోవటం, రామనాథాయి మళ్ళీ పనికి ఉపక్రమించటం చూసేటప్పటికి వాణ్ణి ఆఫీసులో





కలుసుకోటానికి ప్రయత్నించి లాభంలేదనీ, అలా నేను ప్రయత్నించటం వాడికి మరింత బాధ కలిగించినా కలిగించకపోయినా రామనాథాయికే యిష్టంలేదనీ గ్రహించి మానేశాను.

అధికారులు అధికారం చెలాయిస్తూ వుంటేనే అధికారులుగా వుంటారు! లేకపోతే వారికీ కడం వారికీ భేదమేముంది? పై అధికారి కెవరికయినా రామనాథాయిని అక్కడికక్కడే కేకలెయ్యాలని కుతూహలం కలగవచ్చు. నేనో, పరాయివాడో వుంటే ఆయన కోరికను మనస్సులో అణచిపెట్టుకు రావచ్చు. కోరికల్ని మనస్సులో అణచిపెట్టెయ్యటం ఆరోగ్యానికి మంచిది కాదని శాస్త్రజ్ఞులు రుజువు చేస వున్నారు మరి!

"నీ పనిలో నీకింత 'భక్తి' లేకపోతే నీవు కొంత పైకి వస్తూవుండేవాడివేమో!" అన్నాను ఒకసారి.

"నాకీపని యిష్టంలేకపోయినా లభించిన పనిలో నేను కావాలని శ్రద్ధతీసుకోటం అలవాటు చేసుకున్నాను. మరి అందరికీ యిష్టమైన పనులే దొరుకుతయ్యా! తమ పనిలో నిర్లక్ష్యంచూపికూడా పైకి వచ్చే వాళ్ళను చూస్తూన్నా నేను అశ్రద్ధగా వుండలేకపోతున్నాను. అలా వాళ్ళు పైకి రావటం నన్నేమాత్రం ఆకర్షించలేకుండా వుంది. ఎవరైనా తమ పనిలో ఎంత అశ్రద్ధ చూపితే నాకు నా'విధి'లో అంత ఉత్సాహం, గౌరవం పెరుగుతున్నయ్యి. అదిచిన్నప్పుడే నేర్చుకున్నాను!"

"అయితే నీ గతి ఇంతే! కాని నీకెవరో ఈ గుమాస్తాగిరి ఇప్పించకుండా నీవే సంపాదించివుంటే వ్యవహారం ఇంత ఘోరంగా అవతరించేది కాదేమో!"

నా యీ సూచనకు మొదట్లో వప్పుకోక వాదిస్తూవచ్చినా, ఈ మధ్య మౌనంగా వుంటున్నాడు. మౌనం అర్ధాంగీకారమేకదా!

ఏమయితేనేం-రామనాథాయి జీవితం నా జీవితం వేరయిపోయినై. చిన్నప్పటినుంచీ కలిసి చదువుకున్నాం. ఒక వూరివాళ్ళం. ఒక వూళ్ళోనే వుంటున్నాం కాని ఇక మేం ఒకటిగా వుండటానికి సాధ్యంకాదు. మా తరగతులు, అంతస్తులు మారిపోయినై! ఈ సంగతి నాకంటె ముందర రామనాథాయే తెలుసుకున్నాడు. నాకు మటుకు ఈ అదివారమే తెలిసింది.

"ఈ సాయంత్రం కొత్త ఛైర్మనుకు బహిరంగ సన్మానం అవువేగాక-కాని నీవు సినిమాకి రావటానికేం!" అన్నాను నేను.

నా అజ్ఞానంచూసి రామనాథాయి జాలిపడ్డాడు!

"నేనా ప్రాంతాల కనిపించకపోతే నాకు ఛైర్మన్‌పట్ల నిర్లక్ష్యంవుందని ఎవరైనా అనుకుని హెడ్‌గుమాస్తాకు రిపోర్టుచేసి నా ఉద్యోగం తీయించటానికి ప్రయత్నించవచ్చు!"

"అయితే మీ ఆఫీసువాళ్ళంతా వస్తారా?"

"ఎవరి ఇష్టం వారిది."

"రానివాళ్ళకేం అవుతుంది?" అన్నాను నేను.

"కొందరు ఏంచేసినా, ఏం చెయ్యకపోయినా ఫర్వాలేదు" అన్నాడు రామనాథాయి.

రామనాథాయి ఈ అయిదారేళ్ళలో ఎంత జీవితం చూసివుంటాడో నాకు అర్థమైంది. వాడి అనుభవాన్ని తప్పుపట్టటం, ఎగతాళి చెయ్యటం వానాకాలంలో గొడుగుకొనే వాడినిచూసి నవ్వటంలాగానే వుంటుంది. జోరున వానకొడితే గొడుగు పనికిరాకపోవుగాక!

ఇంతావేస్తే కొత్త ఛైర్మన్ వీరాసామి ! తప్పదియ్యా ఇవాళ ఛైర్మన్ అయి కూచున్నాడు. మా నాన్న, రామనాథాయి తండ్రి, వీరాసామి కలిసి చిన్నప్పుడు నాలుగోక్లాసు చదివినవాళ్ళే. పరీక్షలయి స్కూలు తెరచిన మొదటిరోజున వీరాసామి పరీక్ష తప్పాడనీ, మిగిలినవాళ్ళు అయిదో క్లాసుకు వెళ్ళొచ్చనీ మేష్టారు చెప్పారట్ట. కాని ప్యాసు అయినవాళ్ళలో ఒకడు నిజంగా పరీక్షల్లో తప్పాడనీ అయితే అతగాణ్ణి అయిదోక్లాసుకు తోసేశారనీ ఆ రోజుల్లో చెప్పుకునేవారుట. ప్యాసయిన పిల్లలంతా పైక్లాసుకు వెళ్ళుతుంటే వీరాసామి ఒక్కడూ దిగులుగా పాతక్లాసులో కూచునిపోయాట్ట

ఆ తరిక్లాసులో పరీక్షలుతప్పిన కుర్రాళ్ళున్నా వాళ్ళకాసంగతి అదివరకే తెలిసి మొదటిరోజున స్కూలు దాయలకేరాలేదు! ఏమయితే ఏం-వీరాసామిని పై క్లాసుకు నెట్టినవారు లేరుసరికదా అతను పరీక్ష తప్పాడన్న కబురు చెప్పినవాళ్ళూ లేకపోయారు !

వీ రా సా మి అమర్నాటినుంచి మరి స్కూలుకే రాలేదు. వీరాసామిని చదివించటం అతని తండ్రికి సుతరామూ యిష్టం లేదట. భార్య పోరుమీద చెప్పించాడట. తగినశాస్తి అయిందని కొడుకును తనతో పాటే పని చేయిస్తూ వచ్చాడు తండ్రి తదనంతరం వీరాసామి యజమాని అయినాడు.

మునిసిపాలిటీ ఎన్నికల్లో వీరాసామి కూడా పోటీచేశాడు. కొన్నేళ్ళు పోటీపడి ఏపార్టీకి చెందని వీ రా సా మి ని ఛైర్మన్ చేశారు! నిజంగా చెప్పుకోతగ్గ విషయం. జీవితంలో ఏ అవకాశమూ లేక తరతరాలుగా దానిలో కప్పలా జీవిస్తూ వచ్చినవాళ్ళ వ్యక్తి ఛైర్మన్ అయినాడంటే అతనిలో ఏదో విశేషం వుండితీరాలి. అ దే మి టో చూద్దామని సినిమా హాలులో సన్మానసభకు వెళ్ళాను. తతంగం చాలా అయిపోయింది. ఛైర్మన్ కాగితం చదువుతూ తనని యెన్నుకున్న ప్రజలకు కృతజ్ఞత ప్రకటిస్తున్నాడు.

"పద్నాల్గు ఏళ్ళ క్రిందట ఒకనాడు ఓ కుర్రాడు వచ్చెను. పిలచితిని, అతను 'వద్దు' అని తల త్రిప్పెను. నే నాశ్చర్యపోయి 'ఏమని' విచారించితిని. నువ్వు యజమానివి. లెక్కచెయ్యవు క్రిందటిసారి వీధిలోపోయే వాళ్ళతో మాట్లాడుతూ పావుగంటపనిని అరగంటచేసితివి. నీ అసిస్టెంటు చాలు' అని చెప్పెను. ఆమాట నాకు చెంపదెబ్బవలె తగిలెను. బతిమాలి అతనిని కూచోపెట్టి చక్కగా నాకు చేతనైనంత బాగా క్రాపు చేసి పంపితిని. ఆ కుర్రవాని మాటలు నన్ను మార్చివేసినవి. ఇవాళ మీదయవల్ల ఛైర్మన్ అయినాను !"

"ఆ కుర్రాడెంతవాడయి వుండాలో !" అన్నాను నేను రా మ నా ధా యి తో కలిసి ఇంటికి వచ్చేస్తూ.

"నేనేవాణ్ణి !" అన్నాడు రామనాథాయి అంతవరకూ ఏమాటా మాట్లాడకుండా ! వాడిమొహంలో ఆ శ్చ ర్య మూ లేదు, గర్వమూలేదు !

□□□

## రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పిపంప గోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతో పాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని. అట్టివారికి రచనలు త్రిప్పిపంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.





"నాకు మీ ఆఫీస్‌లో పనిచేస్తున్న వాళ్ళందరి ఇళ్లూ తెలియవు అన్నాయ్ !"

పట్టుచీర కట్టుకొని, చేతిలో కుంకుమ భరిణ పుచ్చుకున్న అనసూయ కొత్తగా ఆఫీస్ మేనేజరుగా ప్రమోషన్ పొందిన సుందరంతో అన్నది.

"శంకరాన్ని పంపుతాను. నేను ఆఫీస్‌కెళ్ళి ! అతనొచ్చి అందరి ఇళ్ళూ చూపెడతాడు. అంచాతా నీకు తెలుసున్న వాళ్ళనందర్నీ పి లు చు కు రా !" అన్నాడు సుందరం.

"శంకరాన్నా !" నిర్ఘాంతపోయింది అనసూయ. శంకరం మొన్న మొన్నటిదాకా, సుందరంతోపాటే ఆ ఆఫీసులో గుమాస్తాగా వుండేవాడు. సుందరం అదృష్టం కలి